# లొట్టపీసు పూలు

ఎల్లయ్య పంతులు ఊరికి పెద్దమనిషి. మొగుడిపెండ్లాల కొట్లాటకాంచి కులపంచాయితీలు, గెట్టు పంచాయితీల దాంక తీర్మానం జేస్తడు. అయినోనికి ఆకుల్ల కానోనికి కంచాల్లేసేరకంకాదు. మొన్నామధ్య అడివమ్మ మొగుడిపెండ్లాల పంచాయితీ కూడా ఆయనే తీర్మానం జేసిండు. అడివమ్మ మొగుడు శివుడు. దినాం పెద్దచెర్ల లొట్టపీసుచెట్లను కొట్టుకొచ్చి ఇండ్లకు తడకలల్లుతడు. అల్లినందుకిచ్చిన పైసలుబెట్టి దినాంతాగొచ్చి ఇంటికాడ రచ్చజేస్తండని పంతులుతానకొచ్చి అడివమ్మ ఫిరాదయింది. “రాళ్ళజేనుకు గుంటుకకు పోయినట్టయితుంది” సంసారమని మొరబెట్టుకుంది. ఎల్లయ్యపంతులు పెద్దరికం మందులాగ పనిజేస్తది. భయంజెప్పేకాడ భయంజెప్తడు. బుజ్జగించేకాడ బుజ్జగిస్తడు. శివునికి భయం జెప్పిండు. అడివమ్మ సంసారం బాగుపడ్డది. ఆడ్నించి శివుడు తాగుడు,వాగుడు రెండు బంద్జైనై. సంసారం బుద్ధిగజేసుకుంటుండు.

***

సలువమ్మ ఎల్లయ్యపంతులు పెద్దబిడ్డ . ఆమెకు పదేళ్ళ బిడ్డ యమున, ఐదేళ్ళ కొడుకు అశ్విన్ ఉన్నారు. బొడ్డెమ్మ బతుకమ్మపండుగకు అమ్మగారింటికి పిల్లలతో వచ్చింది. యమునకు తాతంటే శానా ఇష్టం. తాతకు యమున మాటలు తరగని మూటలే. ఇంటి బయట ఎడ్లబండాగింది. పనిమనిషి పాపయ్య సామాన్లు లోపలికి తెచ్చిండు. ఎల్లయ్యపంతులు యమునను ఆమాంతం చేతుల్లోకి తీసుకొని, రెక్కలాశానికెత్తి భుజాలమీద కూర్చోబెట్టుకుండు. తాతమనుమరాలి ముచ్చట ఓపట్టాన ఒడ్వదు.తాతతో

చేనుకాడికి బయల్దేరింది. తాత ఎర్రసంచిని భుజానేసుకుండు. అదెప్పుడు తాత దగ్గరే ఉంటుంది. యమున నవ్వుకుంట తాత సంచిలచేయి పెడితే అందులో శానా డబ్బులున్నై. తాత నవ్వుకుంట ఆ సంచిని యమున మెడల ఏసిండు.

***

చెల్కలకుపోయి తిరిగి పెద్దజెర్వుకట్టమీంచి ఇంటికొస్తుంటే, యమున చెర్లున్న లొట్టపీసుపూలు చూసింది. "తాతా! అయికావాలని" పట్టుబట్టింది. "వద్దమ్మా.. అయి ఇసమంటే"ఇనదు. మొండిఘటం. ఊకొలె. తాత జీబిలి తీసింది. తాతకు తప్పలేదు. చేతికిందున్న పాపయ్యకు చెప్పి, లొట్టపీసుపూలు తెంపుకరమ్మన్నడు. యమున మురుసుకుంట ఆపూలను ఇంటిదాంక పట్టుకొచ్చింది. వాటిని "బొడ్డెమ్మకు పెట్టడాన్కి తెచ్చినని"అమ్మతో జెబితే, అవి పనికిరావని ఆమ్మంది. దాంతో లొట్టపీసు పూలుముఖం మాడ్చినయి.

***

పెత్తరమాసముందు ఎనిమిదిరోజులు ఎల్లయ్య పంతులు ఇంటి ముంగల బొడ్డెమ్మల పండుగ ఆడ్తరు. ఊల్లె ఆ ఒక్క ఆడకట్టున్నే బొడ్డెమ్మలు ఆడ్తరు. పండుగరోజు సలువమ్మ సెల్లెండ్లు పుట్టమట్టితెచ్చి బొడ్డెమ్మను జేస్తరు. బొడ్డెమ్మకు కావాల్సిన తీరొక్కరంగులల్లపూసే బొడ్డుమల్లె, రుద్రాచ్చ, కనకాంబరాలును దొరవారిగడీల తెంపుకొస్తరు. ఊర్లెఉన్న పెండ్లికాని ఆడ పిల్లగాడ్లంతా వారందినాలసంది బొడ్డెమ్మ ఆడిపాడింద్రు.

***

తెల్లారితే సద్దులబతుకమ్మ. కోడికూత ముందేలేచి అందరూ పండుగ పనిలబడ్డరు. తలమీంచి తానాలుచేసింద్రు. పొయ్యిమీద బువ్వలుడికినై. సాంబువ్వాసనకు బయటకుపోతున్న ఎల్లయ్యపంతులు గల్మకాడనే ఆగిండు. సలువమ్మ అయ్యకు తపుకుల సాంబువ్వ బెట్టింది. అయ్యతృప్తిగా తిని, బాకీ వసూలు చేసుకొస్తనని ఎర్రసంచి భుజానేసుకొని యెలుగుపల్లికి పోయిండు.

బొడ్డెమ్మాడే యాల్లయింది. ఆ దినం బొడ్డెమ్మాడి నిమజ్జనం చేయాలి. పెండ్లీడుకొచ్చిన ఆడపిల్లలంత బొడ్డెమ్మాడడానికి సలువమ్మ కాడికొచ్చింద్రు. చెల్లెండ్లు

ఇంటిముంగల ఆకిట్ల ఊడ్సిన్రు. సాన్పి జల్లి,బొడ్డెమ్మ పెట్టేకాడ జాజుతో అలికి, ముగ్గుబెట్టి, పీటేసింద్రు. ఆ ఆడకట్టున ఆడొచ్చినోల్ల కంటే చూడొచ్చినోళ్ళు ఎక్కువుంటరు. ఊరంతాడ్నే ఉంద్రు.

ఆడపిల్లలు బొడ్డెమ్మ చుట్టూచేరింద్రు. సలువమ్మ పాటందుకుంది. పాపమ్మ గొంతుకోయిల గొంతు, చెక్కెర పోసినట్టుంటది. సలువమ్మ పాటకు పడుచుపిల్లలు,అమ్మలక్కలు గొంతు కలిపింద్రు.

బొడ్డెమ్మ బొడ్డెమ్మా.... కోల్
బిడ్డాలెందారు ....కోల్
నీ బిడ్డ నీలగౌరి........ కోల్

అని పొద్దు పోయిందాక, ఇంకోపాట.. ఇంకొక్క పాటని అడుగుతుంటే ఓపికగా పాడింది సలువమ్మ.

పూజయిపోయింది. అయిపోయినంక అందరూ పెద్దజెర్వు కట్టకిందికి బయలుదేరింద్రు. యమునకు సంతోషమైతంది. చెర్ల లొట్టపీసుపూలు మదిల మెదుల్తున్నె. యమునను చూసుకోమని సలువమ్మ చెల్లెకు చెప్పింది. యమున సూపంతా దూరంగున్న లొట్టపీసు పూల మీదుంది. అయికూడా యమునలాగే గాలికి అందంగా నవ్వుతున్నె. వాటి తలలుగాలికి ఊపుతూ పిలుస్తున్నట్టు అన్పించింది. ఒంటేలుకు పోతనని సాకుతోటి పదేళ్ళయమున లొట్టపీసు పూలకాడికెల్లింది. సలువమ్మ చెల్లె పాటమీద మోజుతో పిల్లసోయి మర్సింది.

ఏంకొంపలు మునిగిపోతుందో తెల్వదు.పొద్దుతొందరగా వంగిన్నట్టైంది. ఆడోల్లకు. చీకటి పడుతుంది. అందరూ పెద్దచెరువు నీళ్ళతానకు చేరింద్రు. సలువమ్మ హారతి పాటందుకుంది. గొంతు కలిపింద్రు.

"నిద్రబో బొడ్డెమ్మ..... నిద్రబోవమ్మ
నిద్రకు నూరేండ్లు.... నీకు వెయ్యేండ్లు
నిన్నుగన్న తల్లికి నిండ నూరేండ్లు
పాలిచ్చు తల్లికి బ్రహ్మ వెయ్యేండ్లు

పాలు అన్నం పెట్టి,పాపడ కాయ

నెయ్యి అన్నంబెట్టి,నేరేడు కాయ

పెరుగు అన్నంబు.... పెద ఉసిరికాయ

ఆరగించు గౌరి,అన్నమమృతంబు..."

బొడ్డెమ్మకు చేతులు జోడించి సల్లగ సూడమ్మా ! అని నిమజ్జనం చేసిండ్రు. ఇంతలో ఒకపిల్ల అడిగింది'అక్కా ! బతుకమ్మకు బొడ్డెమ్మకు తేడా ఏందని? దానికి సలువమ్మ "గంగా గౌరిలలో గంగను కొలిసేది బొడ్డెమ్మపండుగ. గౌరిని కొలిసేది బతుకమ్మ పండుగ" అని చెప్పుకుంట, అందరూ గట్టుకు చేరిండ్రు. సలువమ్మ "పిల్లేదని' చెల్లెను అడిగింది. చెల్లె బిక్కమొగమేసింది. అందరి ముఖాల్లో సంతోషం కనుమరుగైంది. సలువమ్మ మనసుకీడు శంకిస్తుంది. ఆందోళన పెరిగింది. చీకటి కమ్ముకుంది. అమ్మలక్కలు చెర్వుకట్టపొంటి వెతుకులాటలో పడ్డరు. సలువమ్మ సెల్లెను తిట్టుకుంట పిల్లను కూతేసుకుంట వెతుకుతుంది. ఎవలో గట్టిగరిసిండ్రు. లొట్టపీసుచెట్లల్ల శవం తేలుతుందని. సలువమ్మ పైప్రాణాలు పైనే పోయినట్టైంది.

***

అడివమ్మ పండుగకు గూడెంలున్న పెద్దమ్మింటికొచ్చింది. ఇద్దన్న తీసుకొచ్చిండు. ఒక్క కడుపుల పుట్టకున్నప్పటికి సొంత అన్నచెల్లెల్ల కంటెక్కువగుంటరు. చిన్నప్పుడే అడివమ్మ అవ్వ సచ్చింది. పెద్దమ్మే అడివమ్మను సాకింది. శివుడుకిచ్చి లగ్గం జేసిండ్రు. ఈతాప పండక్కిరావాలని బావ శివుడునడిగితే, "నేను పండుగనాడొస్తగని, మీ చెల్లెను తోలుకబోమని " చెప్పిండు. చెల్లెను,పిల్లగాండ్లను పండుగకు తీసుకొచ్చిండు ఇద్దన్న.

అడివమ్మ పెద్దమ్మతోకలిసి సద్దలు ఇసుర్రాయిలేసి ఇసురుతుంది. ఇసుర్రాయి మెత్తగ తిరుగుతుంది. ఇసుర్రాయి సప్పుడుకు అడివమ్మ గాజుల సప్పుడు కలిసింది. సప్పుడుకు పిలగాడు మంచిగ నిద్రబోతుండు. ఇసుర్రాయికున్న పిడినిబట్టి పెద్దమ్మ కాసేపు, అడివమ్మ కాసేపు ఇసురుతుండ్రు. అడివమ్మ బిడ్డ అప్పుడప్పుడూ అమ్మమ్మ చేయిబట్టిలాగుకుంట పరాచికాలాడుతుంది. పిల్ల కిలాకిలా నవ్వుతుంది. అప్పుడప్పుడూ ఇసుర్రాయికున్న పిడి వదులైతంది. పక్కనె పెట్టుకున్న గుండ్రాయి తీసుకుని అడివమ్మ మధ్యమధ్యల పిడిమీద గట్టిగ కొడుతుంది. ఇసుర్రాయి కింద సెద్దర్ల, బిడ్డ నవ్వులాగే తెల్లటి పిండి పడుతుంది.

నేత్రికాడ ఇద్దన్న పిడుగులాంటి కబురుజెప్పిండు. నిన్న ఎల్లయ్యపంతులు పెద్దచెర్ల లొట్టపీసుచెట్ల మద్య శవమయి దొరికిండని చెప్పిండు. ఆగమయిన తన సంసారాన్ని చక్కదిద్దిన దేవుడు ఎల్లయ్యపంతులని పెద్దమ్మతో చెప్పింది. చూసొద్దామని ఇద్దన్నతోటంటే, శవం పంచనామాకు పోయింది. "వచ్చినంక పోదాం చెల్లే . గొడ్లకు నీళ్ళుతాపి వత్తనని" కొట్టంకాడికి పోయిండు.

***

గసపోసుకుంట ఇద్దన్నొచ్చిండు. చెల్లెతోని "నువ్వు ఆగమాగం కాకు సెల్లే ..ఒక ముచ్చట చెబుతనని, "ఎల్లయ్యపంతులు ఖునీకేసుల శివయ్య బావను పోలీసోల్లు కచ్చీరుకు పట్టుకబోయింద్రని" చెప్పిండు. అడివమ్మ చేతిలున్నఇసుర్రాయి పిడివదులై ఊడిపోయింది. లబోదిబోమని పెద్దమ్మను పట్టుకొని ఏడ్పందుకుంది. చుట్టుపక్కల ఇండ్లల్ల ఉన్న అమ్మలక్కలు అంతా కూడింద్రు.

***

పంచనామ అయినాంక ఎల్లయ్యపంతులు శవాన్ని ఇంటికి దెచ్చింద్రు. ఎల్లయ్యపంతులు బిడ్డలు కంటికిపుట్టెడు ఏడుస్తుంద్రు. వాళ్లకు తల్లిలేదు. ఉన్న తండ్రిబోయిండు. పెండ్లీడుకొచ్చిన ముగ్గురాడపిల్లలు అట్లనే ఉన్నరు. యమున "తాతా...తాతా...."అని గదుమ బట్టి,"లే...తాతా" "లే...తాతా ! ఆడుకుందాం..లే" అంటుంటే చూడొచ్చినాడోల్ల కండ్లల్ల నీళ్ళు ఉప్పెనై దుంకుతున్నై. యమున వాడిపోయిన లొట్టపీసుపూలుతెచ్చి తాతయ్య కాళ్ళకాడ బెట్టిదండం బెట్టింది. ఊరంతా కన్నీటి సంద్రమయింది.

జనాల నోట్లె అవగింజే దాగదు. శివుడు సంపిండన్న పుకారు ఊరంతా గుప్పుమంది. ఊరుకూరంతా అగ్గిబుక్కినట్టు శివుడి గుడిసెమీద ఇరుసకబడ్డరు. గుడిసెను తగలబెట్టింద్రు.

పడనిజనం నోరు తెరిసింద్రు. "ఎంచబోయినోనికి మంచమంత కంతలు దొరికినట్టు" పెద్దాయన తప్పులు లెంకుతుంద్రు. "నరంలేని నాలుక ఎటైనా మల్తది". కొందరు అడివమ్మకలవాటైండన్నరు. రంకుతెలిసి శివుడే చంపిండన్నరు. కొందరు

“ఎల్లయ్య పంతులు చేతిసంచిల పైకంకు ఆశపడి ఖూనీ చేసిండు” అన్నరు. మరికొందరు “రంకు బయటపడుతదని భయానికి చెర్లదుంకి సచ్చిండన్నరు”.

***

రోజూ అయ్యగారితో వెంట తిరిగే పాపిగాడు అయ్యాల అయ్యగారితో లేడు. ఆ దినం లేనందుకు పాపిగాడు తుండుగుడ్డ ముఖానికి అడ్డంబెట్టుకొని చిన్నపోరనిలా కన్నీరు మున్నీరైతుండు. ఆడికి చూడొచ్చినోల్లంత పాపయ్య ఏడ్పుకు కరిగిపోతుండ్రు. కన్నతండ్రి బోతే ఏడ్చినట్టేడుస్తుండు.

పాపిగాని అయ్య తాగుబోతు. అవ్వపోంగనే, మరో మనువు చేసుకుండు. అప్పట్నించి ఎల్లయ్యపంతులుకాడ నమ్మకంగుంటూ ఇంట్లెమనిషి లెక్క కలిసిపోయిండు. పాపిగాని పెండ్లికూడా ఎల్లయ్యపంతులే జేసిండు. ఆయనతో పోయిరావాల్సిన పాపిగాడు, పొద్దున్న “పెండ్లాం మల్లమ్మకు వంట్లే బాలేదని, దవాఖానల సూపిచ్చాల”ని, పంతులుకాడ పైసలు అడుక్కొని బోయిండు. పొద్దుననంగ బోయిన ఎల్లయ్యపంతులు అదేపోకడ పోయిండు. బొడ్డెమ్మను నిమజ్జనం చేసిన తరువాత పిల్లనెతకబోతే పెద్దచెర్వుల లొట్టపీసు చెట్లమధ్య శవమై దొరికిండు.

***

శివుడిని టేషన్కు తీసుకుబోయిండ్రని ఇద్దన్ననంగనే అడివమ్మ గుండెలు బాదుకుంటూ తలకొట్టుకుంటూ ఏడ్చియేడ్చి సోక్కిపోయింది. తెప్పరిల్లినంక, అదలాబాదల పిలగాడ్ని ఎత్తుకొని ఇద్దన్నతో టేషనుకు చేరింది. సంకన బిడ్డ ఆకలికేడుస్తుండు. పాలివ్వాలని మర్సినట్టుంది. శివుని సంగతి ఇద్దన్న కనుక్కుందమని టేషన్లకు బోయిండు. అమీన్‌సాబు లేడు. బయట కూసోమని జమ్దారు సాబ్ గద్దాయించి చెప్పిండు.

***

అడివమ్మ టేషను బయట యాపచెట్టుకింద కూసుంది. ‘ఈ ముదనాష్ట పోడు ఏంజేసిండో....ఏం కతోనని’ అడివమ్మకు మదిల గుబులైతంది. ఏం జేయాల్నో

కాళ్జేయి ఆడుతలేదు. ఇద్దన్నను మాటిమాటికి లోపలికి బోయిరమ్మని పంపుతుంది. సెల్లె బాధ చూడలేక టేషన్లకు బోతే వాల్లు  కసురుకుంటుంంద్రు. అయినా సెల్లెమీద పావురంతోని లోపలికిబోయి ఆల్లను ఇసిగిస్తుండు. బువ్వాల్లదాటి ఎండనెత్తిమీదకొస్తంది.

ముచ్చట తెల్వంగనే ఏగిలిబారంగ టేషనుకొచ్చింంద్రు. నోట్లె ముఖంపుల్ల కూడేయలె. పొద్దట్నుంచి పచ్చి గంగన్న ముట్టలేదు. సంకన పిలగాడు ఆకలిసోయి మర్సినట్టయింది. ఏడ్సిఏడ్సి ఏడ్వాపిండు. నిద్రలపడ్డడు.

***

“అమీన్సాబొచ్చిండు, రమ్మంటుండ”ని చెప్పంగనే, సంకన పిలగాన్ని పైకి ఎగేసుకొని,  ఇద్దన్నతో దబదబ లోపలికురికింది అడివమ్మ. పోంగనే అమీన్సాబ్ కాళ్ళమీద పడ్డది. ‘నీ కాల్మొక్తయ్యా, నా పెనిమిటటువంటోడు కాదు. ఇడుసురి. ఏ పాపం తెల్వదు. నీ బాంచన్ కాల్మొక్త....’ గోడుగోడున ఏడుస్తంది అడివమ్మ.

ఆ గోలకు లేచిన సంకన పోరనికి ఆకలి గుర్తొచ్చింది. ఇద్దరేడ్వబట్టింంద్రు. ఇద్దన్న కూడా అమీన్సాబు కాళ్ళు బట్టుకుండు. అమీన్సాబు చికాకులుండు. సైగ జేయంగనే, జమ్దారుసాబ్ వాళ్ళను బయటకు తోలుకబోయిండు.

‘పీనిగ దొరికినకాడ శివుడి చెప్పులు, రుమాలు దొరికినై. పంచనామా రిపోర్టులకూడ ఎల్లయ్యపంతులును కుతికబిసికి సంపింంద్రనొచ్చింది’ ఇవరం చెప్పిండు జమ్దారు.’ నమ్మకం లేనట్టుజూసి అడివమ్మ బోరుమంది.

నిమ్మలపడ్డంక “శివుడికి ఎల్లయ్యపంతులుకి మద్య మొన్న పంచాయితీ అయ్యిందటగదా?’ అడిగిండు జమ్దారుసాబు. అడివమ్మ ఇవరంగా చెప్పింది. శివుడు అట్టాంటి మనిషికాదని ఇద్దన్న జమ్దారుకు జెప్పజూసిండు. పోలీసోల్లకు సబూతు కావాలి. అడివమ్మ ఏడ్పు అరణ్యరోదనయింది.

“ఉరికేటోన్ని జూస్తే తరిమేటోన్కి లోకువన్నట్టు’ కోర్టుకుబోయి ఇమాన్దారితనం నిరూపించుకోమనిచెప్పి ఆడ్నుంచి తరిమింంద్రు పోలీసోల్లు. అడివమ్మకు ఏంతోస్తల్లేదు. ఇద్దన్నా..! ఇద్దన్నా...ని దారంతా శోకండాలు బెడ్తూనే ఉంది. ఆ పొళ్ళను జూసి

ఇద్దన్నకు ఆగమాగమయితంది. ఇంటికి తీసుకుబోయి ఇంతెంగిలి బడేదాక దైర్నం జెప్పిండు. రేపు పట్నానికిబోయి వకీలుతో మాట్లాడుతాగని ఏడ్వకని సముదాయించిండు.

***

ఎల్లయ్య పంతులు హత్యకు పెద్దచెర్వు మూగసాక్ష్యమయింది. చెర్వుకు నోరుంటే ఆ గోరాన్నాపేది. ఊల్లె బతుకమ్మపండుగ సంబురం లేకుంటయింది. పీనుగ బోతుంటే ఊరికన్నీటితో పెద్దచెర్వుల నీళ్ళు రెండింతలయ్యింది. పెద్దచెర్వు కట్టమీద ఇసుకబోసినట్టు జనం కదిలింద్రు. చెర్వుకట్టచివర్న దానమయింది. సలువమ్మ కొడుకు తలగోరి పెట్టిండు. దానమయినంక అందరిల్లు జేరింద్రు. చావుకొచ్చిన చుట్టాలు నిద్రజేయొద్దని నిలవలే. సలువమ్మ పెనిమిటి, దగ్గరోల్లు నలుగురైదుగురున్నరు.

***

తెల్లారమ్మటాల్లకు సలువమ్మ నాయన యాదిలపడి చెల్లెండ్లపట్టుకొని ఏడుస్తుంది. దోరోరి గడిల బతుకమ్మకు పూసిన పూలన్నీ ఏడుస్తున్నయి. పాపని పెండ్లామొచ్చింది. మద్యమద్యల కండ్లు వత్తుకుంట కొద్దిసేపేడ్చింది. సలువమ్మ మడిసి మడిసికేడుస్తుంది. అదిజూసి చిన్నపిల్ల యమున బెదిరిపోతుంది. ఆడ్నించి పాపని పెండ్లాము చినపిల్లను వాళ్ళింటికి తీసుకబోయింది. యమున సురుకున్న పిల్ల.పాపయ్య ఇంటితాన పిలగాండ్లతో సెండాట ఆడ్తుంటే, సెండు గాబుల పడ్డది. సెండుతీస్తుంటే తాత ఎర్రసంచి కన్పడింది. ఆ సంచిల చేయిబెట్టింది. డబ్బులు లేవు. లొట్టపీసుపూలున్నయి. అవి వాడిపోయినై. ఆటిని పట్టుకొని ఇంటికి బోయింది.సలువమ్మ చూసి “ఆ పూలెక్కడియి, మళ్ళా ఆ చెర్వుకాడికి పోయినవా …?” అని ఊపిన రెండుదెబ్బలు బలంగా సరిసింది. “అయి ముట్టుకోవద్దని చెప్పిన కదా..” అని కన్నెర్ర జేసింది. పిల్ల ఏడ్పందుకుంది.

యమున ఏడ్పు తగ్గినంక, తాత ఎర్రసంచిల దొరికిన ముచ్చట తల్లికి జెప్పింది. సలువమ్మకు విషయం అర్థమైంది. ఎంటనే సలువమ్మ మొగనితో పాపయ్య ఇంటికి బోయింది. గాబుల నీళ్ళల్ల ఎర్రసంచి, పాపని పాపంలా తేలుతూ కన్పించింది.

***

"పాపయ్య ఏడబోయిండని" సలువమ్మ పాపయ్య పెండ్లాన్నడిగింది. పాపయ్య పెండ్లాము కోపంతో 'వాడు పాడుగాను ... ఈ మద్యపట్టరాని సావాసాలు పడుతుండు. రాసోని తోటల చీట్లపేకాడుతుండు. అయ్యగారికి ఈముచ్చట చెప్దామనుకునేలోపే గిట్ల జరిగిందని' అన్నది. నిన్ననువ్వు యాడున్నవనడిగింది సలువమ్మ. 'పెద్దమ్మబిడ్డ సమర్తాడితే బోయినంది' పాపని పెండ్లాం. దానికితెల్వదు పాపడు దానిపేరుచెప్పి ఎల్లయ్యపంతులు తాన పొద్దుగాల్ల పైసలు అడుక్కపోయింది.

పనికి రావనుకున్న లొట్టపీసుపూలు అతిరహస్యాన్ని పట్టించాయి. పైసకు ఆశపడిన పాపని పాపం బట్టబయలైంది. పాముకు పాలుబోసినట్టయిందని నెత్తినోరు కొట్టుకొంది సలువమ్మ. పక్కలో బల్లెమయితడని ఊర్లె ఎవలూ అనుకోలేదు. ఆ నోటా ఈనోటా ఊరంతా తెలిసి, అంతా బుగ్గలొత్తుకుండ్రు.

***

బతుకమ్మ పేర్చడానికి పనికిరాని లొట్టపీసుపూలు పాపని పాపాన్ని బయటపెట్టినై. అమీన్సాబు రాసోనితోటకు జేరిండు. ఆయన్ను చూడగానే పాపిగానికి నోటమాటరాలె. "నీళ్ళు నమిలిండు". పాపిగాడి పాపం పోలీసుల ముందెక్కువసేపు దాగలేకపోయింది. నల్లికుట్ల పాపిగాడి పాపం లోకమంతా తెలిసింది. ఎల్లయ్యపంతులును చంపిన పాపిగానికి ఇనుపకడాలు పడ్డై .

పెదచెర్వు నీళ్ళు, అడివమ్మ, సలువమ్మ కన్నీళ్ళు వరదలై కడలకు తగిల్నయి. గట్టుకున్న బురదలో మురికిపట్టిన లొట్టపీసుపూలు నీళ్ళుతగిలి తేటగయినై. ఏపాపం తెల్వని శివుడు కటకటాలకు నమస్కారంపెట్టి బయటపడ్డడు. ఇన్నాళ్ళు బువ్వ పెట్టిన లొట్టపీసుచెట్లు గిప్పుడు తన బతుకును కూడా కాపాడినై. తెల్లారిచెర్లకు బోయి లొట్టపీసుపూలకు దండం బెట్టిండు.

**వెలుగు – దర్వాజ,** 18.10.2020